# నేస్తానికి సందేశం

(కథానిక)

"నేనూ వస్తాను నాన్నా, అక్కయ్యగారి వూరు"

అప్పటికి అలా ఎన్నిసార్లు ఏడ్చానో! కాని నాన్న ఓమారూ తీసుకువెళ్ళాడు కాదు. అలాంటి నాన్న ఆసారి ఎందుకో,

అమ్మ..."వాడు ఒకేతీరున ఏడుస్తున్నాడు అక్కయ్యగారింటికని. తీసుకుపోగూడదూ?" అనటంతోటే,

"రేపు వెళ్తున్నానుగా, ప్రయాణం కట్టి ఏడవమనూ" అన్నాడు.

ఇక ఆ రాత్రంతా నిద్రపట్టనే లేదు. "...పోయి రైలెక్కుతాను, అక్కడ అక్కయ్యగారి శీనాయి, చిమిడీముక్కు సీతి, వుంటారు. బావయ్యగారితో సినీమాకిపోతాను. దమడమాల బండీ కొంటాను. శీనాయి లాంటి గుండీలలాగు కుట్టిస్తుంది అక్కయ్య. కారులు బుర్రుబుర్రుమని యీ వూళ్ళో కుక్కల్లాగా తిరుగుతూంటాయి..." ఇలాంటి ఆలోచనల్తో చూడని ప్రపంచాన్ని చూచిన ప్రపంచంలోంచి వూహించడంతో ఉక్కిరిబిక్కిరౌతోంది బుర్ర.

మర్నాడు మధ్యాహ్నందాకా సర్దిందే సర్దడంతో సరిపోయింది. బులపాటంకొద్దీ జారిపోయే లాగును పైకి లాక్కుంటూ నాన్నతో పాటు ఆరుమైళ్ళు నడచి, నడవడమేమిటి? ఓ రకంగా పరుగెత్తి స్టేషన్‌కు వెళ్ళితే, బండి కాస్తా అప్పుడే వెళ్ళిపోయిందట. దానికంతా కారణం నేనే నని నాలుగు తిట్టి, నాన్న అక్కడే ఓమూల నడుం వాల్చాడు, సంచీ తలక్రింద పెట్టుకొని.

రైలుస్టేషనంటూ చూడ్డం నాకదే తొలి సారి. ఆ దుకాణాలూ, తిన్నగా దూళ్ళు తీసి నట్టుండి ఎండలో తళతళలాడే ఆ రైలుబద్దీలు, అంతా అదో గమ్మత్తుగా వుంది.

"వెధవది మావూరు. ఏమీ లేవు. కోమటి సాంబయ్య జంతికలు బుట్టలో పడేసి అముతాడు. ఇక్కడ ఎంచక్కా బీరువాల్లో పెట్టారు! సాంబయ్య యిలాంటి బీరువా ఒకటి కొనుక్కోకూడదూ? వాడేం కొంటాడు! వాళ్ళబ్బాయికి యింత బెల్లం పిసరేనా పెట్టడు." యిలా అనుకుంటూ ఒకొక్కదానిముందే నిలబడి చూస్తున్నాను.

అంతకు ముందున్న జనం కూడా నెమ్మది నెమ్మదిగా పల్చబడుతున్నారు. అప్పటికప్పుడే నాన్న "ఒరేయ్! ఎక్కడున్నావ్? యిలా వచ్చి కూచో" అని రెండు మార్లు కేకవేశాడు, నిద్రపోతూనే.

దాహం వేస్తోంది. "దాహం వేస్తూంది నాన్నా!" అంటే "ఊఁ—" అని మూలిగాడే గాని నాన్న ఏమీ చెప్పలేదు. యింకెవరేనా పెద్దవాళ్ళ నడిగితే? అడగడానికి భయం. అడిగినా వాళ్లు "వెధవా! పోయి కూచో" అంటారు నాన్నలాగే. పెద్దవాళ్ళంతా అంతే.

ఎక్కడో ఆ చివర చెట్టుక్రింద కూర్చొని గుప్పుగుప్పున పొగ వదుల్తున్నాడో పిల్లవాడు. వాణ్ణి అడిగితే? వాడి దగ్గరకు వెళ్ళాను. ఎదురుగా నిలబడ్డాను, ఏమని అడుగుదామా అని.

"ఏమిటి" అన్నాడు అతనే ముందుగా.

"మంచి నీళ్ళు..."

"అదేం కొళాయి."

"నీళ్లు ఎలా వస్తాయి?"

"ఎందుకురావు? నేను రప్పిస్తాను రా" క్రింద వున్న మురికి పంచ చేత్తో పుచ్చుకొని ముందు నడిచాడు. కొళాయి శీల త్రిప్పాడు.

"వచ్చాయి చూశావా?" విజయ గర్వంతో "ఊఁ— త్రాగు" అన్నాడు. ఎలా త్రాగాలో తను త్రాగిచూపించాడు. మధ్యమధ్య కొళాయి కట్టేస్తూ అందులో తనకున్న ప్రావీణ్యాన్నంతా ప్రదర్శించాడు.

---

కనకల లక్ష్మీనారాయణరావు

నాకదంతా చూస్తూంటే, నేను అతనికంటే ఎంతో తక్కువ అనిపించింది. ఒంటినిండా దుమ్మూ, ఎన్నాళ్ళనుండో కత్తిరింపు లేకుండా దుబ్బులా పెరిగిపోయిన రాగి జుత్తూ, చినిగి జీరండాలైన పెద్ద చొక్కా, మీద మరకల్తో అసహ్యమైన ఓ గుడ్డ ముక్కా, ఎముకలు పొడుచుకుంటూ పరమ అసహ్యంగావున్నాడు. కాని వాడికెన్నో విషయాలు తెలుసు. వాడి చూపు యీ ప్రపంచాన్నే లెక్క చెయ్యనంత ధీమాగావుంది. ఈ రైలు స్టేషనంతా తనదే అన్నట్టుంటాడు. చాలా విచిత్రవ్యక్తి.

"ఏవూరు మీది?" అడిగాడు. చెప్పాను.

"ఎక్కడికి కెళ్తావు?" చెప్పాను.

"ఐతే మీకు ఇప్పుడెక్కడబండీ. ఎప్పుడో రాత్రికి వస్తుంది."

"మరెలా?"

"ఎలాగేమిటి? అంతే–"

స్టేషనంతా త్రిప్పాడు "యిక్కడ టిక్కట్లిస్తార"న్నాడు. "ఇది గంటగొట్టేద"న్నాడు. "ఇక్కడ యిది వంచితే అక్కడ చెక్క వంగుతుంద"న్నాడు. "ఇది సామాన్లు తూచేద"న్నాడు. "దీనిమీద కూచుందామా?" అన్నాడు.

"నాన్న కోప్పడతాడు. నాన్నదగ్గరే కూర్చుంటాను."

"సరే పద" అంటూ నా వెంబడే వచ్చాడు. నాన్నకి చాలా ఎడంగా పైగుడ్డ తీసి క్రింద వేసుకొని కూచున్నాడు. ఎవరో కాల్చి పారేసిన సిగరెట్టుముక్క తీసుకొని గుప్పుగుప్పున పొగ వదుల్తూ, "రైలు ఇంజను ఇలాగే పొగ వదుల్తుంది" అన్నాడు.

"ఎంగిలి సిగరెట్టు తాగుతావేం?"

"మంచి సిగరెట్టు కొనడానికి డబ్బులేవీ?" నిజమే. సిగరెట్లుకొనడానికి నాన్నలు డబ్బులు యివ్వరు. పైగా కొడతారు.

"ఆ సిగరెట్టు కాలవకపోతే ఏం? సిగరెట్లు కాల్చినవాళ్ళని మా మాస్టరు కొడతారు."

"కొడతాడూ? ఆ పిలక పుచ్చుకొని ఇలాగ యీడ్చుకురా! నేను వాడి ఎదటే కాలుస్తాను నన్ను కొట్టమను."

"కొడితే?"

"పిలక ఎగరకొడ్తాను. తాను కాలవడూ ఇంతింత చుట్టలూ?"

"ఆఁ ఆఁ కాలుస్తాడు."

"మరి ఇంకెందుకూ పిల్లల్ని కొట్టడం."

"మీనాన్న నిన్నుకొట్టడూ?" నవ్వాడు.

"కొడతాడు కొడతాడు!"

"మరి మీనాన్నని కొట్టావా?"

"ఇప్పుడా? ఎప్పుడో కొట్టాడు. అక్కణ్ణుంచీ నేను వాడిదగ్గరికే పోలేదు."

"మరి నీ వెక్కడుంటావు?"

"ఇక్కడే."

"అన్నం?"

"ఇక్కడే"

"ఎవరు పెడతారు

"ఎవరో"

నాకిదంతా గమ్మత్తుగా వుంది. "అమ్మ లేదూ?"

"అమ్మా, చచ్చిపోయింది"

"ఎందుకు చచ్చిపోయింది?"

అతను మాట్లాడలేదు. కోపం వచ్చినట్టుంది. అతని ముఖం చూస్తుంటే ఏదోబాధపడుతున్నట్టుంది.

కొంతసేపటికి "మీ నాన్న మంచివాడేనా?" అడిగాడు. నాకేం చెప్పాలో తోచలేదు.

"నీకు డబ్బులూ అవీ యిస్తుంటాడా?"

"నాన్న యివ్వడు. మారాం చేస్తే అమ్మ యిస్తుంది."

"నాన్నలంతా యింతే. దొంగ వెధవలు"

"అమ్మ పావలా యిచ్చింది"అన్నాను జేబు చూపిస్తూ.

"ఐస్ ఫ్రూట్ ఎప్పుడన్నా తిన్నావా? చాలా బాగుంటుంది. కొనికొకటి.కొందామా" అన్నాడు.

నేనేమీ చెప్పకముందే"ఒరే. ఐస్ఫ్రూట్!" అని పిలచాడు. మూడు తీసుకున్నాడు. ఒకటి నాకిస్తూ "డబ్బు లియ్యి"అన్నాడు.

"ఏమిటీ చోరవ?" అని లోపలే అనుకుంటూ యిచ్చేశాను.

రెండూ ఒకేసారి చప్పరించేస్తున్నాడు. నాకుమాత్రం పళ్ళన్నీ జివ్వున లాగేస్తున్నాయి. చేతులవెంట నీరు కారిపోతుంది.

"నాకిది బాగాలేదు. పారేస్తాను" అన్నాను.

"మొదట్లో అంతేలే. యిలా తే" నా చేతిలోది లాక్కున్నాడు.

"ఇదేమిటి? ఎంగిలి తింటాడు. ఛీ!" అనిపించింది.

"చేతులు కడుక్కోవూ, కొత్త బట్టలు పాడైపోతాయి" అంటూ కొళాయి దగ్గరకు ప్రయాణం కట్టాడు.

అతడు నీళ్ళువదుల్తూంటే, కాళ్ళూ చేతులు కడిగాను. ఆటలో చొక్కా సగం తడిసిపోయింది. పోయి బెంచీమీద కూర్చున్నాం.

నాన్న "ఒరేయ్! ఎక్కడ" అని కేక పెట్టాడు.

"మీ నాన్న నిద్ర పోతూనైనా, నిన్ను ఎక్కడా? అని కేక పెడ్తాడు. మా నాన్నకి అసలు నా ధ్యాసే లేదు" అన్నాడు చేతులు చొక్కాకు తుడుచుకుంటూ.

"ఏం? ఎందుకనీ?"

"అంతే. ఎప్పుడూ కల్లు అమ్మే ఆ గౌరామ ఇంట్లో పడి చస్తాడు. గొంతుకొనా తాగడం, దానితో సరసాలాడుతూ కూచోడం. అమ్మ బ్రతికుండగానూ అంతే. ఎప్పుడేనా అమ్మ కాళ్ళా వేళ్ళా బడి బ్రతిమలాడితే తూగుతూ యింటికొచ్చేవాడు. ఇక ఆరోజల్లా అమ్మని బూతులు కుయ్యడం, తన్నడం, అమ్మ దాచుకున్న డబ్బులన్నీ ఎత్తుకుపోవడం."

"అలాంటివాణ్ణి మీ అమ్మ ఎందుకు పిలుచుకు వస్తుందీ?"

"ఏమో! దాని మొఖం తగలెయ్యా. కొన్నాళ్ళు పిలుచుకు రమ్మని నన్ను పంపేది. ఆ రాత్రిళ్ళ చీకట్లో బిక్కుబిక్కుమంటూ ఈ చివరనుంచి ఆ చివరకు పోతే వాడు వస్తేనా? పైగా యింటికి పొమ్మని కసిరేవాడు. భయం అని అంటే ఎందుకొచ్చేవని కొట్టేవాడు."

"పాపం!"

"అదంతా చిన్నప్పుడులే. తర్వాత ఏమయిందనుకున్నావ్? అమ్మకి ఓ ఆడపిల్ల పుట్టింది. ఎంతచక్కగా వుండేదనీ. కానీ, అమ్మకు జబ్బు చేసింది. చెల్లాయి పుట్టిందగ్గర్నుంచీ అమ్మ పనిలోకి పోవడం లేదు. ఇంట్లో ఏమీ లేవు. నాకు ఆకలి, మరి అమ్మేమో పండుకొని లేవలేదు. అయ్య వుంటే ఆడి సంపాదనంతా గౌరాను యింటోనే.

"నాయనా మీఅయ్యదగ్గరకుపోయి తిండానికేమైనా అడుగు" అని మూలిగేది అమ్మ రోగంతో. నాకు పోవాలని వుండేదికాదు. ఐనా లోపల ఆకలి. అమ్మ కన్నీళ్ళు చూడలేక పోయేవాడిని. ఇంతా వెళ్ళితే వాడు పలకనేనా పలికేవాడు కాదు.

"చివరినాడు అమ్మ చచ్చిపోతానని గోల మొదలెట్టింది. అయ్యని తీసుకొస్తే ఆడి మొగం చూసి చచ్చిపోతానంది. చెల్లినీ, నన్నూ ఆడికి అప్పగించి పోతానంది."

"మరి తీసుకురాక పోయావూ?"

"పోయానుగా. పోయి యిదంతా చెప్పి ఏడిస్తే 'పోపో పోరా. దొంగ టక్కులు' అన్నాడు. నేనింకా ఏడిస్తే గౌరామ వచ్చి "నా యింట్లో ఏడవమాక"మని బైటకు నెట్టి తలుపేసింది.

"ఆ మర్నాడు అమ్మ చచ్చిపోయ్యాక వచ్చాడు. అమ్మ ముక్కునున్న కాడా చేతుల గోట్లూ లాక్కొని దాచుకున్నాడు. వాళ్ళూ వీళ్ళూ అడగమంటే అడిగాను నాకియ్యమని. అందుకు నన్ను చావ చితగ్గొట్టి పోయి గౌరామ యింట్లో దూరాడు. ఆతర్వాత రెండు రోజులకి చెల్లాయీ చచ్చిపోయింది. మా అయ్యమాత్రం రానేలేదు..."

"పాపం—మరి నీకు అన్నమో..."

"అదే...ఆ తర్వాత ఐదారురోజులపాటు ఆ చుట్టుపట్ల వాళ్ళు యింతగంజి పోసేవాళ్ళు. కాని వాళ్ళుమాత్రం ఎన్నాళ్ళని పోస్తారు? అప్పట్లో అడుక్కోడంకూడా చేతయ్యేదికాదు. అక్కడక్కడా తిరిగొచ్చి ఆ గుడిసెలోనే తొంగుంటూ వుండేవాణ్ణి.

"చివరికి ఓనాడు, మా అయ్య గుడిసె అమ్మివేశాడని ఆ కొన్నవాళ్ళువచ్చి నన్ను తోలేశారు. అప్పట్నుంచీ ఇక్కడే"

అమాంతంగా చెప్పడం ఆపివేసి ఆకాశం వేపు చూస్తూ కూర్చున్నాడు. మళ్ళా నావంక చూడకుండానే చెప్పడం మొదలెట్టాడు.

"ఈ రైళ్ళలో ఎక్కుతూంటాను. అడుక్కుంటూంటాను. ఎవడేనా కర్కోటకుడుంటే,

టికట్టు లేదని రెండుతన్ని దించేస్తాడు. మళ్ళీ యింకో పెట్టెలో ఎక్కుతాను."

"అడుక్కుంటే నీకు తిండికి సరిపోతుందా?"

"అదొకటేనా? ఇక్కడెవరన్నా దిగివచ్చి అన్నాలు వండుకుంటారు. వాళ్ళకి అవీయివీ చేసిపెడతాను. వాళ్లు ఓముద్ద పడేస్తారు. ఎవరివేనా మూటలు మోస్తాను. వాళ్లు ఓ కానీనో, పరకో యిస్తారు. మరీ కాకపోతే ఎవరో నిద్రపోయేవాళ్ళని చూస్తాను. ఒకటో, రెండో దొరుకుతాయి..."

"దొంగతనమే!"

"కాక మరేమిటి"

"పోలీసులు పట్టుకోరూ?"

నవ్వాడు. "ఏడ్చారు. వాళ్ళకిమాత్రం తెలియదూ. ఏ దొంగతనమూ చెయ్యకపోతే—ముష్టి అడుక్కునేవాళ్లు పోలీసులు కెట్లా మామ్మాళ్ళిస్తారనీ?

"అసలు పోలీసువాళ్లు మమ్మల్ని దొంగతనం చేస్తేనే పట్టుకుంటా రనుకున్నావా? ఇక్కడేదిపోయినా మమ్మల్నందర్నీ పట్టుకొని చావ చితగ్గొడ్తారు. దొంగతనం చేసినా, చెయ్యకపోయినా తన్నులు తప్పవాయె. దొంగతనం చెయ్యకుండావుంటే మాత్రం లాభం ఏముంది, తినే దెబ్బలుతింటూ కడుపుమాడ్చుకోడం తప్ప. మరి యిక్కడ యింతే. చేసుకుందామంటే పనేనా దొరకదు."

జీవితాన్ని కాచి వడపోసిన వాడిలా మాట్లాడుతున్నాడు. ఆశ్చర్యపోతూనే, 'ఏం' అన్నాను.

"ఏం ఏమిటి. యిక్కడ నేను మూటలు మోస్తాను. కాని నాలాంటి వాళ్ళిక్కడ కావలసినంతమంది వున్నారు. యిక మాకందరికీ, రోజంతకూ తలకో రెండు మూటలు దొరుకుతాయేమో. అంటే ఓ అణా గిడుతుందన్న మాట. అందుకనే నేను రంగూన్ పోదామనుకుంటున్నాను. అక్కడ పనిచేసుకొని బ్రతకొచ్చుట. అక్కడ మనదేశం వాళ్ళకి తప్పకుండా పని దొరుకుతుందట. అక్కడికే పోతాను."

"మళ్ళీరావూ?"

"ఎందుకు రానూ? మనకి స్వరాజ్యం వస్తుందట. అది వచ్చాక వస్తాను. అప్పుడు ఇక్కడే హాయిగా వుండొచ్చు."

"అదే మంచిది."

"నిజంగా ఒట్టు వేసుకొని చెబుతున్నాను. నిన్న మధ్యాహ్నం నుంచీ కొళాయి నీళ్ళూ, ఇందాకటి ఐస్ ఫ్రూటూ తప్ప మరేమీ లేదు."

నాకు జాలివేసింది. "జంతికలు కొందామా?" అన్నాను.

అనడమే ఆలస్యం. మూడు అణాల కానీ ముక్తసరిగా తినేశాడు. కాళ్ళీ కడుపుకు కొళాయి నీళ్ళు పట్టించి నిలబడ్డాడు.

"రంగూను నిజంగానే వెళ్తావా?"

"ఎప్పుడోనా? యిప్పుడంటే యిప్పుడు. మీతోపాటే మీరెక్కే బండిలోనే విశాఖపట్నం వస్తాను. అక్కణ్ణించీ ఓడెక్కి రంగూన్ పోతాను" అని ధీమాగా నిలబడ్డాడు.

నాకూ సర్దాగానే వుంది.

"మళ్ళీ స్వరాజ్యం వచ్చాక వస్తాను. ఇక్కడే కనబడ్తాను. లేకపోతే మీ వూరే వస్తాను."

మాతోపాటే బండి ఎక్కాడు. మేము మధ్యలోనే దిగిపోయాం. అతను తిన్నగా వెళ్లిపోయాడు. ఖచ్చితంగా రంగూనే వెళ్లాడు. కాదనడానికి వీల్లేదు.

* * *

ఇది పదేళ్ళక్రిందటి సంగతి. మీలో కొందరైనా రంగూన్ వెళ్లేవాళ్లుంటారు. అతను మీకక్కడ కనిపించితే యీ మాట కాస్త అతని చెవిని వెయ్యండి. మీకు పుణ్యముంటుంది.

"మనకి స్వరాజ్యం వచ్చిన మాట నిజమే. కాని అది నీలాంటివాళ్ళకు మాత్రం కాదు. కాబట్టి పొరపడి గభీమని వచ్చెయ్యకు. ఇంకా కొంతకాలం ఓపికపట్టు"——అని.